సాక్షి
అనంతపురం
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.20,100

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,100 ధర పలికాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.



జిల్లా వ్యాప్తంగా గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

ప్రాణం పోతున్నా పట్టదా!

- అనంతపురం సర్వజనాస్పత్రిలో పసికందుల మృత్యుకేళి
- 8 నెలల్లోనే 190 మందికి పైగా మృతి
- వైద్యుల తీరుపై తీవ్ర విమర్శలు
- అవగాహన కల్పించడంలో వైద్యారోగ్య శాఖ విఫలం
- మంత్రి సత్యకుమార్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రయోజనం శూన్యం



- ఫొటోలో కనిపిస్తున్న బిడ్డ బరువు 1.3 కేజీలు. వాస్తవంగా ప్రసవం అంచనా తేదీ ఏప్రిల్ 20 కాగా, బీపీతో బాధపడుతున్న తల్లి ఈ నెల 6నే సర్వజనాస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం పసికందు వెంటిలేటర్‌పై కృత్రిమ శ్వాస తీసుకుంటూ ప్రాణాలతో పోరాడుతోంది.



- ఈ బిడ్డ బరువు 1.5 కేజీలు. ప్రసవం తేదీ ఈ నెల 3న ఉన్నా.. జనవరి 15నే జన్మించింది. ఇంట్రా యూటెరిన్ గ్రోత్ రిస్ట్రిక్షన్ (ఐయూజీఆర్) సమస్యతో ఇబ్బంది పడుతోంది. వీరే కాదు.. సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూలో పదుల సంఖ్యలో శిశువులు పలు సమస్యలతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు. వివిధ కారణాలతో ఇటీవలి కాలంలో వందలాది మంది మరణించారు.

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్)లో పసికందులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా వందల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోతుండటం కలవరపెడుతోంది. నెలలు నిండకనే ప్రసవం, తల్లికి సమస్యలుండటం, పౌష్టికాహార లోపం, వైద్యుల అలసత్వం తదితర కారణాలతో గత 8 నెలల్లోనే 190 పైకిగా మరణాలు సంభవించాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులకు అనంతపురం సర్వజనాస్పత్రి పెద్ద దిక్కు. ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సత్యకుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నారు. తన ఇలాకాలోని పెద్దాస్పత్రి శిశువుల వార్డులో మృత్యువు విలయతాండవం చేస్తున్నా ఆయన పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అవగాహన కల్పించడంలో విఫలం..

మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అయితే, అవగాహన లేక పౌష్టికాహారం తీసుకోకపోవడం, క్రమం తప్పక పరీక్షలు చేయించుకోకపోవడం, గతంలో సమస్యలు ఉన్నా వాటిని గుర్తించకపోవడం తదితర కారణాలతో నెలలు నిండకనే బిడ్డలకు జన్మనిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యశాఖ సిబ్బంది గర్భిణుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేలా చైతన్యం తీసుకు రావాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. ఆరోగ్య శాఖకు చెందిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, హెల్త్ ఎడ్యుకేటర్ల బాధ్యతా రాహిత్యం శిశువుల ప్రాణాల మీదకు తెస్తోంది.

వైద్యుల నిర్లక్ష్యం..

ఇదంతా ఒక ఎత్తయితే సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించకపోవడం కూడా పసికందుల మరణాలకు దారితీస్తోందనే విమర్శలున్నాయి. గత 8 నెలల్లోనే 190 మందికి పైగా శిశువులు మరణించిన నేపథ్యంలో ఆస్పత్రి ఉన్నాధికారులు మరింత శ్రద్ధ వహించాల్సి ఉంది.కానీ, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భ్రమరాంబ దేవి ఏనాడూ ఎస్‌ఎన్‌సీయూను తనిఖీ చేసిన పాపాన పోలేదు. ఈ క్రమంలో ఎస్‌ఎన్‌సీయూ వైద్యులు పత్తా లేకుండా పోతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు.




సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న పసికందులు

సమస్యలెన్నో..

ఆరోగ్యవంతమైన శిశువు 2.5 కేజీలు, ఆపై బరువు ఉండాలి. అంతకంటే తక్కువ ఉంటే శ్వాసకోశ, సెప్సిస్, గుండె సమస్యలతో పాటు పలు అంటురోగాలు తలెత్తుతాయి. సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూలో అడ్మిషన్ పొందే పసికందుల్లో 50 నుంచి 60 శాతం తక్కువ బరువు, వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న వారు ఉంటున్నారు.

కలెక్టర్ స్పందిస్తేనే..

జిల్లా కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ వినోద్‌కుమార్‌కు వైద్య రంగంపై అపార అనుభవం ఉంది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆయన ఎన్నో చర్యలు తీసుకుని రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రమంలో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప పరిస్థితులు దారికొచ్చేలా లేవు.



పరీక్షలు చేయించుకోవాలి



చిన్న వయసులోనే పెళ్లి, పౌష్టికాహార లోపం, రక్తహీనత, బీపీ తదితర సమస్యలతో నెలలు నిండకనే ప్రసవాలు సంభవిస్తున్నాయి. బిడ్డ ఆరోగ్యంగా జన్మించాలంటే గర్భం దాల్చినప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి. విధిగా పరీక్షలు చేయించుకోవాలి. గర్భం దాల్చినప్పటి నుంచి 7 నెలల వరకు నెలకోసారి, 7 నెలల నుంచి 9 నెలల వరకు 15 రోజులకోసారి, 9 నెలల నుంచి వారానికోసారి పరీక్షలు చేయిస్తే మంచి ఫలితాలుంటాయి.

– డాక్టర్ మల్లిక, గైనకాలజిస్టు, జీజీహెచ్

శిశు మరణాలు వాస్తవమే



ఎస్‌ఎన్‌సీయూలో అధిక సంఖ్యలో మరణాలు సంభవిస్తున్న మాట వాస్తవమే. మరణాల రేటు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాం. సమీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం. ఎస్‌ఎన్‌సీయూలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

న్యూస్‌రీల్

చింతపండుకు రికార్డు ధర



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండుకు గరిష్ట ధర దక్కింది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 364 క్వింటాళ్ల చింత పండు వచ్చింది. మొదటి రకం (కరిపులి) కనిష్ట ధర క్వింటాలు రూ.8,200, సగటు ధర రూ.15వేలు, గరిష్ట ధర రూ.29 వేలు పలికింది. ఇక రెండో రకం (ఫ్లవర్) కనిష్ట ధర క్వింటాలు రూ.4వేలు, సగటు ధర రూ.8,500, గరిష్టం రూ.9,500 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. ప్రతి సోమ, గురువారాల్లో చింతపండు, మంగళ, శుక్రవారాల్లో మిర్చి క్రయ విక్రయాలు మార్కెట్‌లో జరుగుతున్నాయని, రైతులు, వ్యాపారులు నాణ్యమైన సరుకు తీసుకొచ్చి మంచి ధరలు పొందాలని సూచించారు.

సేవాలాల్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం



కలెక్టర్‌కు సేవాలాల్ చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

గుత్తి రూరల్: సేవాలాల్ జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గుత్తి మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవా గఢ్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంత్యుత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష చేపట్టారు. గురువారం సేవాగఢ్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో సేవాగఢ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థ నాయక్, గుత్తి, గుంతకల్లు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14, 15 తేదీల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, ఈ క్రమంలో సేవాలాల్ ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమీప గ్రామాల్లో నాటుసారా, మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సర్పంచ్ అప్పా వెంకటేష్, ట్రస్టు వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, కోశాధికారి బాలానాయక్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఓబిలేసు, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, డీటీ సూర్య నారాయణ పాల్గొన్నారు

సిబ్బంది జీతాలు ఎందుకు కట్ చేస్తున్నారు?

- బొమ్మనహాళ్ పీహెచ్‌సీ వైద్యురాలిపై డీఎంహెచ్ఓ మండిపాటు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి ఈబీ దేవి

బొమ్మనహాళ్: సిబ్బంది జీతాలు ఎందుకు కట్ చేస్తున్నారంటూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శ్రీలక్ష్మిపై జిల్లా వైద్యాధికారిణి (డీఎంహెచ్ఓ) ఈబీ దేవి మండిపడ్డారు. ఆస్పత్రిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి పనితీరుపై సిబ్బందితో విడివిడిగా విచారించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మిపై డీఎంహెచ్ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతోనే ఇలా మాట్లాడితే, ఇక సిబ్బందితో ఎలా ఉంటారో అర్థమవుతోందన్నారు. తీరు మారకపోతే కఠిన తప్పవని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ వైద్యాధికారిణి శ్రీలక్ష్మిపై ఇటీవల ఫిర్యాదులు అందాయని, దీంతో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో కాన్పులు స్టాఫ్‌నర్సులే చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వైద్యాధికారి, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని సూచించామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

'సూపర్ స్పెషాలిటీ'లో డబ్బులడుగుతున్నారు

- గోకులం రేకులషెడ్ బిల్లు చేసేందుకు లంచం డిమాండ్ చేస్తున్నారు
- 'ఫోన్ ఇన్'లో కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు

అనంతపురం అర్బన్: 'అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారు. సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. ఇదేమని అడిగితే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు' అని బాధితురాలు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పంచాయతీరాజ్' సమస్యలపై కలెక్టర్ గురువారం ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంత మిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా...

ఫిర్యాదుదారు: నాపేరు వరలక్ష్మి. రామగిరి మండలం. మా అమ్మకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్చాం. ఆస్పత్రిలో ఎటువంటి సదుపాయాలు లేవు. వీల్ చైర్లో తీసుకెళ్లాలంటే రూ.200 అడుగుతున్నారు. యూరిన్ పైప్ పెట్టాలంటూ రూ.500 తీసుకున్నారు. సెలైన్ బాటిల్ పూర్తయినా నర్సులు స్పందించడం లేదు. పడకపై దుప్పట్లు మార్చడం లేదు. బాత్ రూమ్‌లు శుభ్రం చేయడం లేదు. ఏదైనా అడిగితే... ఇది ప్రైవేటు ఆస్పత్రి కాదు. అన్నీ ఉచితంగా చేస్తున్నామంటూ తీవ్రస్థాయిలో అరుస్తున్నారు.

కలెక్టర్: ఆస్పత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తాం.



ఫోన్ ఇన్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

దురుసుగా ప్రవర్తించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తాం. ఇకపై ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.

ఫిర్యాదుదారు: నాపేరు రాజేశ్వరరెడ్డి. యల్లనూరు మండలం. గోకులం పథకం ద్వారా రేకులషెడ్ ఏర్పాటు చేసుకున్నా. టెక్నికల్ అసిస్టెంట్ చెప్పిన వారి ద్వారా, వారు చెప్పిన నాణ్యతతోనే పని పూర్తి చేయించా. బిల్లు పెట్టేందుకు లంచం డిమాండ్ చేస్తున్నారు. రూ.2.30 లక్షలకుగాను మార్జిన్ మనీ 10 శాతం పోగా రూ.1.87 లక్షలు వస్తుందని అంటున్నారు.

కలెక్టర్: పథకం కింద ఎంత అర్హత ఉందో పరిశీలించి అంత మొత్తం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదుదారు: నా పేరు కళ్లాయిస్వామి. మాది ఉరవకొండ. తాగునీటి సమస్య అధికంగా ఉంది. సత్యసాయి నీళ్లు రెండు వారాలకు ఒకసారి వస్తాయి. ఎందుకు ఇలా ఇస్తున్నారని వర్కర్లను అడిగితే.. మాకు జీతాలు రావడం లేదు... పైపులు పగిలి పోయాయి.. అంటూ ఏదో ఒక కారణం చెబుతున్నారు.

కలెక్టర్: సత్యసాయి వాటర్ స్కీమ్‌లో ఏవైనా సమస్యలు ఉంటే పరిశీలించి మీ ప్రాంతంతో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదుదారు: నా పేరు గురుమూర్తి. బుక్కరాయసముద్రం గ్రామం. ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీకి రోడ్డు ఏర్పాటు చేయాలి. కాలనీలో నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయించాలి.

కలెక్టర్: పంచాయతీ అధికారుల ద్వారా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మీ నివాసాలు గ్రామకంఠంలో ఉన్నాయా, ప్రభుత్వ భూమిలో ఉన్నాయా అధికారులు వచ్చి పరిశీలించి ఎలా పరిష్కరిస్తారనేది చెబుతారు.

కేంద్రీయ విద్యాలయం సందర్శన

గుత్తి: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయాన్ని గురువారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సందర్శించారు. విద్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం వీఎంసీ (విద్యాలయం మేనేజ్‌మెంట్ కమిటీ) సమావేశం నిర్వహించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు బాగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్కీ సాబ్, తహసీల్దార్ ఓబులేసు, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, వీఆర్వో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాజహిత వీడియోలు చేయండి

- ఎస్పీ జగదీశ్ పిలుపు

అనంతపురం: సమాజానికి ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలను రూపొందించాలని సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లూయెన్సర్లకు ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సైబర్ నేరగాళ్ల ఆటలు కట్టడి చేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. రోడ్డు ప్రమాదాలతో అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఎంతో మంది మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పత్రికలు, టీవీలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృత ప్రచారం అవసరమని భావించామన్నారు. యూట్యూబర్లు సామాజిక బాధ్యతగా భావించి వీడియోలు రూపొందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల కట్టడి, ప్రమాదాలు జరిగిన వెంటనే గంటలోపు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు ఎలా నాశనమవుతాయో యువతకు చేరేలా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం డిస్కవర్ అనంతపురం వారు తయారు చేసిన యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ షేక్ జాకీర్, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ వెంకటేశ్ నాయక్, 150 మంది యూట్యూబర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా షీలారెడ్డి



అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ తొలి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సి. షీలా రెడ్డి నియమితులయ్యారు. వివిధ వర్సిటీల్లో పనిచేస్తున్న 15 మంది ప్రొఫెసర్లు ఇంటర్వ్యూలకు హాజరైనా.. నాణ్యమైన పరిశోధనలు, పాలనలో సమర్థత, విశేష బోధనానుభవం ఉండటంతో షీలారెడ్డికి అవకాశం దక్కింది. అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (అప్పా)కు సంబంధించి మూడు సార్లు అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలతో పాటు రెండు అంతర్జాతీయ, రెండు జాతీయ సదస్సులను ప్రొఫెసర్ షీలా రెడ్డి నిర్వహించారు. 14 అంతర్జాతీయ జర్నల్స్, 19 జాతీయ జర్నల్స్, 14 బుక్ చాప్టర్స్, 6 పుస్తకాలు రచించారు. 5 మేజర్, 5 మైనర్ ప్రాజెక్టులను పూర్తి చేశారు. 30 అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగించారు. రెండు పీహెచ్‌డీ అవార్డులు షీలారెడ్డి పర్యవేక్షణలో పూర్తయ్యాయి.

కోళ్ల మరణాలపై అప్రమత్తం

- పౌల్ట్రీ ఫారాలను సందర్శించిన పశు సంవర్ధక శాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల అసాధారణ మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాలు సందర్శించి కోళ్ల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా అలాంటి మరణాలు సంభవిస్తున్న దాఖలాలు లేవన్నారు. అనుమానిత ప్రాంతాలు, అవసరమైన చోట కోళ్ల నుంచి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా అసాధారణ పరిస్థితులు ఉన్నట్లు గమనిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. ఖాళీ స్థలాలు, బావులు, వాగులు, రోడ్డు పక్కన చనిపోయిన కోళ్లను పడేయకూడదని, గుంత తీసి పాతిపెట్టి పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అపోహలకు పోకుండా బాగా ఉడికించిన గుడ్లు, మాంసం తీసుకోవచ్చని పేర్కొన్నారు.

● జై సునామ జకినీ మాతా

కనులపండువగా జాతర





సునామ జకినీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం, ఊరేగింపులో పూర్ణకుంభాలతో పాల్గొన్న మహిళలు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో గురువారం సునామ జకినీ మాత జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో ఆరె కటికలు తరలివచ్చారు. సునామ జకినీ మాత ఆలయంలో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది కన్యలు, ముత్తయిదువులు గుత్తిలోని వాసవీ షిరిడీ సాయి బాబా దేవాలయం వద్ద నుంచి పూర్ణ కుంభాలతో సునామ జకినీ మాత ఆలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. 'జై శ్రీ సునామ జకినీ మాతాకీ, శ్రీ మల్యామ జకినీ మాతాకీ జై' అనే నినాదాలు మార్మోగాయి. మిమిక్రీ, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సునామ జకినీ మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ రావు, ఆలయ ధర్మ కర్త సురేష్‌రావు, కార్యానిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతీ బాయి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, కోశాధికారి సుధాకర్‌రావు, ఉప కోశాధికారి బాబు రావు, సాయి, అమర్, వేలాది మంది ఆరె కటికలు పాల్గొన్నారు.

పుష్ప పల్లకీలో కొండమీద రాయుడు

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కొండమీద రాయుడు పుష్ప పల్లకీలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. శుక్రవారం రాత్రి శ్రీవారు సింహ వాహనంపై ఊరేగనున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

కాలం చెల్లిన ప్రణాళిక... కానరాని అభివృద్ధి



- పాతికేళ్ల క్రితం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌తో పట్టణాభివృద్ధి అస్తవ్యస్తం
- గత ప్రభుత్వంలో కొలిక్కి వచ్చిన వైనం
- కొత్త మాస్టర్ ప్లాన్ తయారీలో అంతులేని జాప్యం
- అమల్లోకి తెస్తే పట్టణ వాసులకు ప్రయోజనం

రాయదుర్గం: పట్టణాభివృద్ధిలో కీలకమైన బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) రూపకల్పనలో పురపాలక సంఘం ఉదాసీనత కనబరుస్తోంది. దశాబ్దాల క్రితం రూపొందించిన ప్రణాళికనే ప్రాధాన్యతగా తీసుకుని చేపట్టిన పనులతో పట్టణాభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. ఇలాంటి తరుణంలో చేపట్టిన నూతన ప్రణాళిక రూపకల్పన కాస్త నత్తనడకన సాగుతోంది.

పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామి

రాయదుర్గం ప్రాంతం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో పట్టణ వైశాల్యం మరింత విస్తరించింది. అయితే దీనికి తగినట్లుగా ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎప్పుడో పాతికేళ్ల క్రితం 2001లో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి 2002లో ఆమోదించారు. 2021 వరకు కొనసాగేలా గెజిట్ ప్రకటించారు. ప్రస్తుతం ఇదే అమల్లో ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాయదుర్గం పట్టణంలో 32 వార్డులు, 75 వేల జనాభా ఉంది. వివిధ వృత్తులపై ఆధారపడి 10,852 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో రాయదుర్గం వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కొలిక్కి తెచ్చిన గత ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధి ప్రణాళికను ఓ కొలిక్కి తెచ్చింది. రాడికల్ సర్వే సంస్థకు బృహత్ ప్రణాళిక తయారీ బాధ్యతను అప్పట్లో అప్పగించారు. 2023లోనే తుది జాబితాకు మార్గదర్శకాలు జారీ చేశారు. అదే సమయంలో జగనన్న శాశ్వత భూ–హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు గుర్తించేందుకు డ్రోన్ సర్వేకు శ్రీకారం చుట్టారు. దీంతో పట్టణాభివృద్ధి ప్రణాళిక అమలులో జాప్యం చోటు చేసుకుంది. 2024లో మరోసారి తెరపైకి తెచ్చినా... ఎన్నికలు కోడ్ రావడంతో అమలుకు నోచుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టణాభివృద్ధి ప్రణాళిక ఊసే ఎత్తకపోవడంతో జాబితా కాస్త అటకెక్కింది. ఫలితంగా పట్టణాభివృద్ధి గాడి తప్పింది.

అమలుకు ప్రాతిపదిక ఇదే..

సాధారణంగా ఓ పట్టణం లేదా నగరాభివృద్ధికి సంబంధించి 20 ఏళ్ల పాటు కార్యాచరణ అమలులో ఉండేలా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారు. నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల విభజన, ఖాళీ స్థలాలు, పార్కులు, ఇతర స్థలాలు, ప్రజా వినియోగ ప్రాంతాలు, రవాణా, సమాచార వ్యవస్థ, రోడ్లు, శ్మశాన వాటికలు, కొండలు, గుట్టలు, జలవనరులు, నీటి ప్రవాహ ప్రాంతాలు, కాలువలు సహా అన్నింటికీ సంబంధించిన సమగ్ర సమాచారం ఇందులో ఉంటుంది. భవన నిర్మాణ అనుమతులు వాటి ప్రకారమే మంజూరవుతాయి. అయితే రాయదుర్గం పట్టణానికి సంబంధించి దశాబ్దాల నాటి మాస్టర్‌ప్లానే ఇప్పటికీ అమలులో ఉండటంతో అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు. పుట్టప్పతోట డ్రెయినేజీ నిర్మాణం అర్ధంతరంగా ఆపేశారు. పట్టణానికి ఆనుకుని ఏర్పాటు చేసిన డంపింగ్ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ లేదు. నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కాలంటే నూతన ప్రణాళిక అమల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వర్షం వస్తే రామస్వామివీధి దుస్థితి ఇలా

త్వరలో కొత్త మాస్టర్‌ప్లాన్



కొత్త మాస్టర్‌ప్లాన్ తయారీకి రాడికల్ సంస్థ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అందించిన మార్గదర్శకాల మేరకు బృహత్ ప్రణాళిక సిద్ధం చేయడానికి మరో మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశం ఉంది. కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే పట్టణంలో మౌలిక సౌకర్యాలు మెరుగుపడుతాయి. రోడ్ల విస్తరణ జరుగుతుంది. వీలైనంత త్వరగా కొత్త మాస్టర్ ప్లాన్‌ను అందుబాటులోకి తెస్తాం.

– మురళీమోహన్, టౌన్‌ప్లానింగ్ అధికారి, రాయదుర్గం

పొలం సరిహద్దు విషయంలో ఘర్షణ



తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు

గుత్తి రూరల్: పొలం సరిహద్దు విషయంగా చోటు చేసుకున్న ఘర్షణలో ఇద్దరు రైతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం బేతాపల్లికి చెందిన జి.రామాంజనేయులు, జి.సురేంద్రకు ఊటకల్లు గ్రామ శివారులో పొలాలు ఉన్నాయి. వీరి పక్క పొలం ఉన్న ఊటకల్లు గ్రామానికి చెందిన రైతు సుబ్బరాయుడుతో కొంత కాలంగా భూ సరిహద్దు వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తమ పొలాలను సర్వే చేసి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులకు రామాంజనేయులు, సురేంద్ర విన్నవించారు. దీంతో మండల సర్వేయర్ సాయి, వీఆర్‌ఓ శివారెడ్డి గురువారం సర్వే చేసి హద్దులు చూపేందుకు వచ్చారు. ఓ వైపు వారు సర్వే చేస్తుండగా అక్కడే ఉన్న రామాంజనేయులు, సురేంద్రతో రైతు సుబ్బరాయుడు గొడవకు దిగి తన ఇద్దరు కుమారులతో కలసి రాళ్లతో దాడికి తెగబడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు, సురేంద్రను తోటి రైతులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలికపై లైంగిక దాడి

- బాధితురాలు ఏడు నెలల గర్భవతి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- యువకుడిపై పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: కడుపునొప్పితో బాధపడుతున్న బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆ తల్లిదండ్రులు అసలు విషయం తెలిసి హతాశయులయ్యారు. మైనారిటీ తీరకనే తమ బిడ్డ మరో బిడ్డను కడుపులో మోస్తోందని తెలిసి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు... జిల్లాలోని మరో ప్రాంతానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం కొన్నేళ్ల గార్లదిన్నెకు వలస వచ్చి ఇందిరమ్మ కాలనీలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. తమ కుమార్తె (మైనర్ బాలిక)తో కలసి గ్రామంలోని వీధుల్లో సంచరిస్తూ చెత్త సేకరించి, గుజరీకి వేయడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారు నివాసముంటున్న ప్రాంతానికి చెందిన ఓ యువకుడు (వివాహితుడు).. బాలికను మాయమాటలతో లోబర్చుకుని పలుమార్లు తన శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బాలిక తనకు కడుపునొప్పిగా ఉందంటూ తల్లిదండ్రులకు తెలపడంతో వారు స్థానిక ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె 7 నెలల గర్భంతో ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు బాలికను ఆరా తీయడంతో అసలు విషయం తెలిసింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మామూళ్లు తీసుకుంటూ నా బియ్యాన్నే పట్టుకుంటారా?

- పోలీసులతో బియ్యం అక్రమ వ్యాపారి వాగ్వాదం
- ఇంకా ఎంత కావాలో చెప్పాలంటూ దబాయింపు
- గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని వదిలేసిన పోలీసులు



ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో బియ్యం పంచాయితీ చేస్తున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'ప్రతి నెలా స్టేషన్‌కు మామూళ్లు ఇస్తున్నా... అయినా నా బియ్యాన్నే పట్టుకుంటారా? ఎంత ధైర్యం? ఇంకా ఎంత డబ్బు కావాలో చెప్పండి. ఇచ్చేస్తా. పట్టుకున్న బియ్యాన్ని వెంటనే వదిలేయండి' అంటూ పోలీసులపై రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారి చిందులేశాడు. ఉరవకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... ఉరవకొండ పట్టణానికి చెందిన ఓ బియ్యం వ్యాపారి బుధవారం రాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఐచర్ వాహనంలో తరలిస్తుండగా స్థానిక డ్రైవర్స్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై ఓ హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ పట్టుకున్నారు. వాహనంతో సహా రేషన్ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సదరు బియ్యం వ్యాపారి గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిపై చిందులేశాడు. ప్రతి నెలా తనను నుంచి మామూళ్లు తీసుకుంటూ తన బియ్యాన్నే ఎలా పట్టుకుంటారంటూ దబాయించినట్లు తెలిసింది. దీంతో వెనక్కు తగ్గిన పోలీసులు వెంటనే స్టేషన్ ప్రాంగణంలోనే బహిరంగ ప్రదేశంలో సదరు వ్యాపారితో కూర్చొని మంతనాలు జరిపారు. కాసేపటి తర్వాత ఆ స్టేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ కానిస్టేబుల్ గుట్టుచప్పుడు కాకుండా బియ్యంతో పాటు వాహనాన్ని వదిలేశాడు. దీనిపై స్టేషన్ సిబ్బంది కొందరు అసహనం వ్యక్తం చేశారు. నిజాయితీతో తాము పనిచేస్తుంటే కొందరి పనితీరు వల్ల పోలీసు వ్యవస్థ మంట కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కొంతమందికి మాత్రమే బియ్యం వ్యాపారుల మామూళ్లు అందుతున్నాయని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

'వర్చువల్ ల్యాబ్'పై అవగాహన

అనంతపురం: ఓటీపీఆర్‌ఐ విద్యార్థులకు వర్చువల్ ల్యాబ్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. శంకర్ వర్చువల్ ల్యాబ్‌ను ఎలా అనుసంధానం చేయాలో విద్యార్థులకు వివరించారు. ఈ ప్రయోగశాల విస్తృత ప్రయోజనాలను ఒక గూగుల్ లింక్ ద్వారా వివిధ కళాశాలలకు సమాచారాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. దుర్గాప్రసాద్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద కందులతో నిరసన

- అధికారులు స్పందించలేదని తలుపులకు తాళం
- చెట్టుకిందే రెండు గంటలపాటు నిరీక్షించిన తహసీల్దార్
- తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతుసంఘం డిమాండ్



ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా దళారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. రాప్తాడులో కంది కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులతో కలసి గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కందులను రాసిగా పోసి ధర్నా చేపట్టారు. అధికారులు స్పందించక పోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటలకు వరకూ తహసీల్దార్ విజయకుమారి చెట్టు కిందనే నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... మండలంలో ఈ సారి కంది పంటను ఎక్కువగా సాగు చేశారన్నారు. ఈ క్రమంలో పంట దిగుబడులకు మార్కెటింగ్ సదుపాయం లేక ఇళ్లలోనే నిల్వచేసుకున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, క్వింటా రూ.7,550తో కాకుండా భారీగా పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మరో రూ.2 వేలు పెంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరి కారణంగా ఇప్పటికే చాలా మంది రైతులు క్వింటా రూ.6 వేలతో దళారులకు విక్రయించి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈఓ రంజిత, వీపీఏ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని భరోసానిచ్చానా వినలేదు. దీంతో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ విజయకుమారి స్పష్టమైన హామీనివ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, రైతు సంఘం మండల అధ్యక్షుడు పోతులయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలు ఎన్నటికీ ఆదుకోవు

- రైతుల సంక్షేమం సమగ్ర చర్యల ద్వారానే సాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్ (చిత్రంలో) సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: కంపెనీలతో ఒప్పందాలు ఉద్యాన రైతులను ఎన్నటికీ ఆదుకోలేవని, సమగ్ర చర్యలు చేపట్టడం ద్వారానే పండ్ల తోటల రైతుల సంక్షేమం సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో ప్రభుత్వం నిర్వహించిన హార్టీకల్చర్ కాంక్లేవ్ ఈ ప్రాంత ఉద్యాన ఉత్పత్తుల గురించి ప్రచారానికి తోడ్పడిన తీరును సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే పండ్లతోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడాన్ని ఆక్షేపించారు. పండ్లతోటల రైతులతో విస్తృతంగా చర్చించి వారిని ఆదుకోవడానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. జిల్లాలో వరుస కరువులతో 15 ఏళ్లుగా వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి వనరుల అభివృద్ధిలో తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వాలు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, రాయితీలు, ఉచిత విద్యుత్ ఇవ్వడం, ఉపాధి ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ అభివృద్ధి చేయడంతో ఉద్యాపంటల సాగు పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతపై అధికారులు దృష్టి పెట్టక పోవడం బాధాకరమన్నారు. బుధవారం జరిగిన కాంక్లేవ్‌లో ఈ విషయం స్పష్టంగా కనిపించిందన్నారు. పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి బదులు కంపెనీలు, ఒప్పందాలు చుట్టూ తిప్పారన్నారు. వందకు పైగా కంపెనీలు వస్తాయని ఆశిస్తే ఏడు కంపెనీలు మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమం ప్రచారానికి ఉపయోగపడిందే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. కంపెనీల ఒప్పందాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ వ్యవసాయ విధానంలో భాగమన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట హిజ్రాల ధర్నా

- మోసం చేసిన యువకుడిపై కేసు నమోదుకు డిమాండ్

విడపనకల్లు: తమ సమాజంలోని హిజ్రాను నమ్మించి మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం పాల్తూరు పీఎస్ ఎదుట పలువురు హిజ్రాలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హిజ్రాలు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన హిజ్రా దేవీప్రియ (30)తో హావళిగి గ్రామానికి చెందిన యువకుడు మడకశిర (వివాహితుడు) పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. తన శారీరక అవసరాలు తీర్చుకోవడంతో పాటు జీవిత కాలం పాటు కలిసి ఉంటానని నమ్మించి రూ.9 లక్షల వరకు డబ్బు కూడా తీసుకున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా ముఖం చాటేస్తూ రావడంతో దేవీప్రియ తట్టుకోలేకపోయింది. పలుమార్లు ప్రయత్నించినా మడకశిర స్పందించలేదు. దీంతో గత మంగళవారం హావళిగి గ్రామానికి చేరుకున్న దేవీప్రియ నేరుగా మడకశిర ఇంటికి చేరుకుని నిలదీసింది. తనతో కాపురం చేయాల్సిందేనంటూ పట్టుబట్టింది. ఆ సమయంలో గొడవ చోటు చేసుకోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన దేవీప్రియ తన శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను సంబంధీకులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం ఆమె మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం అదే రోజు మృతదేహాన్ని పాల్తూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం ఉదయం పలువురు హిజ్రాలు పాల్తూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని దేవీప్రియను ఆత్మహత్యకు ప్రేరేపించిన మడకశిరపై కేసు నమోదు చేయాలంటూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ ఫోన్ ద్వారా ఆందోళనకారులతో చర్చించారు. న్యాయం చేస్తామంటూ భరోసానివ్వడంతో హిజ్రాలు ఆందోళనను విరమించారు.

క్లుప్తంగా

9న రెడ్డి వివాహ పరిచయ వేదిక



రాప్తాడు రూరల్ : రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వేదిక ఏర్పాటు చేస్తామని, ఉచితంగా నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని రెడ్డి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకులు రొద్దం సురేష్ రెడ్డి, గౌరవాధ్యక్షులు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు మంత్రి విశ్వనాథరెడ్డి కోరారు.

సమయాన్ని వృథా చేయకండి

- విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బు కొఠారి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కుష్బు కొఠారి

కళ్యాణదుర్గం రూరల్: పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని విద్యార్థులకు బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బు కొఠారి సూచించారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు గురువారం స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో 'ప్రేరణ – శిక్షణ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీడీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో 647 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. పదో తరగతి పరీక్షలకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ క్రమంలో సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆత్మవిశ్వాసంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ గంగాద్రి, వార్డెన్లు రాజశేఖర్, పద్మావతి, అరుణ, ఓబులమ్మ, నాగరాజు, అశ్వత్థ, సత్యనారాయణ, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆదేశాల మేరకు పోలీసులు గురువారం చేపట్టిన తనిఖీల్లో 9 మంది మట్కా బీటర్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1,75,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమన్నారు. పట్టుబడిన మట్కా బీటర్లపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. త్వరలో గంజాయి, సైబర్‌క్రైంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ - ఒకరి మృతి



తీవ్రంగా గాయపడిన వన్నూరుస్వామి

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని మొలకాల్మూరుకు చెందిన హనుమంత (30) గురువారం ఉదయం గుమ్మఘట్ట మండలం బీటీపీ గ్రామానికి వెళ్లాడు. అక్కడ పనిముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే అనంతపురం నుంచి జె.వెంకటాంపల్లికి వెళుతున్న వన్నూరుస్వామి, సాకమ్మ దంపతుల ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో హనుమంత అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వన్నూరు స్వామి, సాకమ్మను స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి క్షతగాత్రులను తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- బళ్లారి విమ్స్‌లో చికిత్స... భార్య పరిస్థితి విషమం

బొమ్మనహాళ్: కుటుంబ కలహాలతో దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన బొమ్మనహాళ్ మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఉప్పరహాళ్‌కు చెందిన నరసింహులు, సరోజమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కర్ణాటకలోని బొమ్మదేవరపల్లి గ్రామంలో జరిగిన ఊరి దేవర వేడుకకు వెళ్లి గురువారం సాయంత్రమే స్వగ్రామం వచ్చారు. అయితే ఏమైందో ఏమో గానీ దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సరోజమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. ఆ వెంటనే నరసింహులు కూడా పురుగుల మందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగువారు వారిని బళ్లారి విమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం సరోజమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన గురించి బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్‌ను వివరణ కోరగా, కుటుంబ కలహాలతో దంపతులు పురుగుల మందు తాగినట్లు తెలిసిందన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

తొండపాడులో హుండీ కానుకల లెక్కింపు



గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. ఏడు నెలలకు గాను రూ.7,95,365 నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్న రెడ్డియాదవ్, రంగస్వామి రెడ్డియాదవ్, డేగా మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు పాల్గొన్నారు.

పంటల రక్షణకు సరికొత్త యాప్

- వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: అందుబాటులోకి వచ్చిన 'సీఎల్ఎస్–పీడీఎస్ఎస్' యాప్‌ను ఉపయోగించుకుని పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సస్యరక్షణ ఖర్చులు బాగా తగ్గించేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. యాప్ వినియోగంపై గురువారం స్థానిక వ్యవయసాయ శాఖ కార్యాలయంలో ఏఓలు, ఏడీఏలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యాప్ పనితీరు, చీడపీడలు, తెగుళ్ల విశ్లేషణ, సస్యరక్షణ సిఫారసులను పరిశీలించే విధానంపై చైతన్య పరిచారు. యాప్ వినియోగం ద్వారా పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లు, పురుగులను గుర్తించడం, పోషక లోపాలను గుర్తించడం, వాటిని సరిచేయడం చాలా సులభమన్నారు. గ్రామాల్లో పని చేస్తున్న ఆర్‌ఎస్‌కే సిబ్బంది పంటల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాటిని ఎప్పటికప్పుడు డీఆర్‌సీ సిబ్బంది పరిశీలించి విశ్లేషిస్తారన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా సరైన సస్యరక్షణ సిఫారసులతో కూడిన సమాచారం సదరు రైతు సెల్‌ఫోన్‌కే మెసేజ్ వెళుతుందన్నారు. తద్వారా సరైన మందులు సరైన సమయంలో పిచికారీ చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గుతాయన్నారు. పంట దిగుబడులు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఆదేశించారు. రబీకి సంబంధించి 1,92,665 ఎకరాలు ఈ–క్రాప్‌లో నమోదైందన్నారు. 49,493 మందికి గానూ 41,570 మంది ఈ–కేవైసీ చేయించుకోగా మిగిలిన రైతుల వివరాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి కిసాన్‌డ్రోన్లు అందుబాటులోకి తేవడానికి వీలుగా ప్రతి మండలానికి ఒక సీహెచ్‌సీ గుర్తించి వారికి పైలెట్ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఆసక్తి కలిగిన సీహెచ్‌సీ గ్రూపు వివరాలు వెంటనే పంపాలని ఆదేశించారు. సమావేశంలో టెక్నికల్ ఏఓలు వెంకట్ కుమార్, రాకేష్‌నాయక్, బాలానాయక్ పాల్గొన్నారు.

పాడి ఆవుల అపహరణ

అమరాపురం: మండల కేంద్రంలో నివాసముంటున్న కాటప్పకు చెందిన రెండు పాడి ఆవులను దుండగులు అపహరించారు. బుధవారం రాత్రి తన రెండు ఆవులను ఇంటి బయట కట్టేశాడు. గురువారం తెల్లవారుజామున బయటికి వచ్చి చూడగా ఆవులు కనిపించలేదు. ఇరుగు పొరుగు వారిని లేపి వెతికినా ఫలితం లేకపోయింది. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. అలాగే, మద్దనకుంట గ్రామ రైతు చంద్రప్పకు చెందిన ఓ పాడి ఆవును, చిట్నడకు గ్రామంలో మరో ఆవును అపహరించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత పాడి రైతులు తెలిపారు.

బీపీఎస్‌పై అంతులేని నిర్లక్ష్యం

- ఈ ఏడాది మార్చి వరకు 'బీపీఎస్' పొడిగింపు
- నగరంలో బీపీఎస్ చేయించుకోని 218 భవనాల యజమానులు
- నగరపాలక సంస్థ ఆదాయానికి రూ.9 కోట్ల మేర గండి
- నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు



బీపీఎస్‌కు అవకాశం..

అనంతపురం కార్పొరేషన్: నగరంలో భవనాల క్రమబద్ధీకరణ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) అమలయ్యే సూచనలు కన్పించడం లేదు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో నిర్మాణదారులు ఏళ్ల తరబడి బీపీఎస్ చేసుకోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి రూ. కోట్లలో గండిపడుతోంది. వాస్తవంగా నగరంలో జరిగే అనధికార నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలపై అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, కమిషనర్ మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శిరీష ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చే వాటిపై కూడా దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

అభివృద్ధికి అడ్డు..

నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం ద్వారా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా ఉంటుంది. కానీ అధికారులు ఆదాయ మార్గాలను అన్వేషించడం లేదు. ఏసీపీ శిరీష క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కార్యాలయంలోనే తిష్ట వేశారన్న విమర్శలున్నాయి. ఇటీవల శ్రీనగర్ కాలనీలో నగరపాలక సంస్థకు చెందిన స్థలాన్ని కబ్జా చేసినా అటువైపు తొంగి చూడని విషయం విదితమే. ఇప్పటికైనా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ప్రత్యేక శ్రద్ధ చూపి నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చేలా చూస్తారో లేదో చూడాలి.

ఈ నెల నుంచి మార్చి 31 వరకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన వాటికి బీపీఎస్ చేసుకోవచ్చు. అది కూడా 2019కు ముందు నిర్మించిన భవనాలకు మాత్రమే అవకాశం కల్పించారు. గత ప్రభుత్వంలో వెయ్యి వరకు భవనాలు ఉంటే అప్పట్లో ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో 800 వరకు బీపీఎస్ చేసుకున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం బీపీఎస్‌కు అవకాశం కల్పించింది. ప్రస్తుతం నగరంలో 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో 218 భవనాలు బీపీఎస్ చేసుకోవాల్సి ఉంది. ఈ భవన నిర్మాణదారులు బీపీఎస్ చేసుకుంటే నగరపాలక సంస్థకు రూ.7.5 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు లైసెన్స్ ఇంజినీర్లు, నిర్మాణదారులను అప్రమత్తం చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో ప్లానింగ్ కార్యదర్శులు పదుల సంఖ్యలో ఉన్నారు. కనీసం వీరి ద్వారానైనా బీపీఎస్ చేసుకోవడం ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం రావడంతో పాటు నిర్మాణదారులకు డబుల్ ట్యాక్స్ మినహాయింపు ఉంటుంది. కానీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే అడ్వెటైజ్‌మెంట్ ప్రకటనలకు సంబంధించి లాలిపప్స్, సైన్‌బోర్డుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంలో రూ.లక్షల్లో ఆదాయం గండిపడింది.

అప్రమత్తం చేస్తున్నాం

భవనాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువు పెంచిన విషయం విదితమే. బీపీఎస్ చేసుకోవాలని సంబంధిత నిర్మాణదారులకు ఫోన్‌లు చేయడంతో పాటు సందేశాలు పంపిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న భవనాలకు బీపీఎస్ చేయిస్తాం.

– శిరీష, ఇన్‌చార్జ్ ఏసీపీ

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన బాబా సలాం


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బాబా సలాం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబా సలాం మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడలో మాజీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్‌లోకి సుజికి యాక్సెస్


ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో అమృత్ సుజికి షోరూంలో సరికొత్త సుజికి యాక్సెస్ 125 ద్విచక్రవాహనాన్ని గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. నూతన టెక్నాలజీ, అధిక మైలేజీ, పికప్.. ఈ వాహనం ప్రత్యేకత అని రీజనల్ సేల్స్ మేనేజర్ శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ శివప్రసాద్, షోరూం డైరెక్టర్ రుకేష్‌రెడ్డి, మేనేజర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు లే అవుట్ పరిశీలన


కందుకూరు లే అవుట్‌ను పరిశీలిస్తున్న అహుడా వీసీ, జేసీ శివనారాయణ్ శర్మ

అనంతపురం కార్పొరేషన్: కందుకూరులోని ఎన్టీఆర్ మిడిల్ ఇన్కమ్ గ్రూప్ లే అవుట్‌ను అహుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ గురువారం పరిశీలించారు. లే అవుట్‌లో మౌలిక వసతులు, టెండర్ ప్రక్రియ ప్రతిపాదనలు, మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. జేసీ వెంట ఇంజినీరింగ్ అధికారులు తదితరులున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు ప్రారంభం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో వెలిసిన రామాంజనేయస్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. తొలిరోజు గంగానయనం, గోపూజ, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య మేళనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, అగ్నిమథనం, మృత్సంగ్రహణం, అకురారోహణం, కలశారాధన, వాస్తు హోమం, బింబ జలాధివాసం, మహామంగళ హారతి పూజలు జరిగాయి. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు ఉంటాయి. సాయంత్రం 4.10 గంటల నుంచి 5.20 గంటలలోపు ధ్వజస్తంభ ప్రతిష్ట, మహాస్నపనము, సాయం దీక్షా హోమం, వేద పారాయణం ప్రతిష్ఠాంగ హోమాదులు ఉంటాయి. చివరి రోజు శనివారం యంత్ర ప్రతిష్ట, బింబి, శిఖర, ప్రాణ ప్రతిష్ట, బింబికళాన్యాసం పూజలు ఉంటాయి. 11.05 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంది.

భక్తిశ్రద్ధలతో మధ్వ నవమి

అనంతపురం కల్చరల్: మాఘమాసంలో వచ్చే మధ్వ నవమి వేడుకలను మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో స్వామివారి బృందావనాన్ని అలంకరించి పూజలు చేశారు.అనంతరం రజిత రథంలో స్వామివారిని ఆలయంలోనే ఊరేగిస్తూ స్వామివారి గీతాలను ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షుడిగా 'చింతా'



అనంతపురం కార్పొరేషన్ : వైఎస్సార్ సీపీ అనంతపురం నగరాధ్యక్షుడిగా చింతా సోమశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. తనపై నమ్మకం ఉంచి నగరాధ్యక్షునిగా మరోసారి అవకాశం కల్పించిన మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డికి 'చింతా' ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కల్తీ పాలను అరికట్టాలి


అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కల్తీ పాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి కలిశారు. నగరంలో 15 పాయింట్లలో పాల పంపిణీ జరుగుతోందని, అటువంటి కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు అబూసలేహా, లాలెప్ప, నాయకులు దాదు ఉన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోండి


మాట్లాడుతున్న తోపుదుర్తి సర్పంచ్ చిత్రా ఓబులేసు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున

ఆత్మకూరు: మద్యం మత్తులో జరిగిన గొడవకు కులం రంగు పూసి రాజకీయం చేయడం టీఎన్ఎస్ఎఫ్ నేత బండి పరశురామ్‌కు తగదని, ఇకనైనా చిల్లర బుద్ధులు మానుకోవాలని తోపుదుర్తి సర్పంచ్ చిత్రా ఓబులేసు హితవు పలికారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గవ్వల మల్లికార్జునతో కలిసి సర్పంచ్ మాట్లాడారు. తన కుమారుడు చిత్రా అభిపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచరులు దాడిచేశారని ఆరోపిస్తూ బండి పరుశురామ్, బిల్లే నాగేంద్ర పత్రికల్లో వార్త రాయించడాన్ని తప్పు పట్టారు. తన కుమారుడు మద్యం మత్తులో గ్రామంలో గొడవ పడితే.. ఆ ఘటనకు కులం రంగు పూసి రాజకీయం చేయాలనుకోవడం ఎంతవరకు న్యాయమన్నారు. తన కుమారుడు మద్యం మత్తులో తనతో ఎన్నోసార్లు గొడవపడుతుంటారని గుర్తు చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని బండి పరశురామ్‌ను హెచ్చరించారు. గ్రామంలోకి వచ్చి నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాజకీయంగా ఎదగడం, గుర్తింపు తెచ్చుకోవడం కోసం కులాల పేరుతో చిచ్చుపెట్టి గ్రామాల్లో కక్షలకు ప్రేరేపిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని అంధుల ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ గురువారం ప్రారంభించారు. సుజలాన్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో అంధుల కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి అవసరం ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. అంధుల ఆశ్రమ నిర్వాహకులకు 'సెర' సంస్థ అండగా ఉంటూ వాటర్ మార్కెటింగ్ చేయిస్తుందన్నారు. అపార్ట్‌మెంట్‌లు, హోటల్స్, హాస్టళ్లకు సరఫరా చేసేలా చూస్తారన్నారు. సుజలాన్ ఫౌండేషన్ ప్రతినిధి సూర్యమోహన్ మాట్లాడుతూ తమ కంపెనీ తరుపున అంధుల అభివృద్ధికి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమవద్ద ఉన్న అంధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల ఆశ్రమ డైరెక్టర్ లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సుజలాన్ ఫౌండేషన్ ప్రతినిధి రామకృష్ణ, సెర సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని అదనపు జిల్లా న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి నిబంధనలకు కట్టుబడి ఉంటామని వాహనదారులచే ప్రతిజ్ఞ చేయించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, తదితరులున్నారు.

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: 'వాహనాల డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వద్దు. ప్రాణాలే ముద్దు' అని రవాణా శాఖ అధికారులు యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై వర్క్ షాప్ నిర్వహించారు. రవాణా శాఖ ఉప కమిషనర్ వీర్రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌళి, రవాణా శాఖ అధికారులు సురేష్ నాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ రాజు హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి మనోహర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు విష్ణు ప్రియ, సుధాకర్, శ్రీనివాసులు తదితరులున్నారు.

కౌన్సిల్ తీర్మానాలు అమలు చేయండి

- మేయర్ వసీం


అధికారులతో సమావేశమైన మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: గత కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలను తక్షణం అమలు చేయాలని, ట్రాక్టర్ల ఏర్పాటు, అదనంగా కార్మికులను తీసుకోవాలని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో అధికారులతో మేయర్ వసీం సమావేశమయ్యారు. కౌన్సిల్ తీర్మానాల అమలులో జాప్యంపై డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఎస్ఈ భాస్కర్ రావు, ఈఈ షాకీర్, రాధాకృష్ణలపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులలోపు బడ్జెట్ సమావేశం నిర్వహించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మూడు రోజుల లోపు అంచనాలు తయారు చేయాలన్నారు. నగరంలో వేసవిలో తాగునీటి సమస్యలు రానివ్వద్దని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లీకేజీలు లేకుండా పైప్‌లైన్‌లను పరిశీలించాలన్నారు.అదేవిధంగా మోటర్లు కాలిపోయినా ఇబ్బంది లేకుండా స్టాండ్ బై మోటర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్టోరేజ్ ట్యాంక్‌లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ..ఉండాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వేసవి ముగిసే వరకు అధికారులతో సమన్వయం చేసుకుని నగరంలో ఎక్కడా నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు లాలూ, శేఖర్ బాబు, సైఫుల్లాబేగ్, డీఈలు నరసింహులు, సత్యనారాయణ, అకౌంటెంట్ దేవశంకర్, మేనేజర్ లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను అమలు చేయాలి



రాష్ట్రపతికి అంగన్‌వాడీలు సమర్పించనున్న అర్జీలను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: అంగన్‌వాడీలను మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానంతో పాటు గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రపతికి వ్యక్తిగత అర్జీలను కొరియర్ ద్వారా పంపించనున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో అర్జీలను ఆ సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి, నాయకురాళ్లు విడుదల చేసి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 17 నుంచి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు తలపెట్టామన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తూ జీఓ ఇవ్వాలన్నారు. 17, 18 తేదీల్లో ప్రాజెక్టు స్థాయిలో ఆందోళనలు, 19వ తేదీన ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా ఉంటుందన్నారు. క్రమబద్ధీకరణ, గ్రాట్యుటీ అమలుకు అర్జీలను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతికి పోస్టు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కాత్యాయిని, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు నక్షత్ర, రేవతి, షాహినా పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం రూరల్: సమాచార హక్కు(స.హ) చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు వన్నూరప్ప అన్నారు. గురువారం బాలాజీ బీఈడీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. వన్నూరప్ప మాట్లాడుతూ స.హ చట్టం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు భారత్ గౌరవ్ పురస్కార్


పురస్కారమందుకుంటున్న లెనిన్

అనంతపురం కల్చరల్: ప్రజా గాయకుడు లెనిన్ బాబు భారత్ గౌరవ్ పురస్కారాన్ని అందుకున్నాడు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా వేదికగా దేశంలోనే అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా అత్యున్నత సేవలందిస్తున్న 51 మందికి గురువారం అవార్డులు అందించారు. యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పనతో పాటు సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనంత వాసి లెనిన్ బాబును 'భారతీయ సంస్కృతీ ఉత్సవ్ -7' నిర్వాహకులు గోవిందాచార్య బసవరాజ్ పాటిల్, మాధవరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందించారు.

10న నులిపురుగుల నివారణ దినం


రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

రాప్తాడు: ఈ నెల పదో తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఏటా ఫిబ్రవరి పదో తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను విధిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'స్పాట్' అడ్మిషన్ల గడువు పొడిగింపు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ, ఫార్మా.డి కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల గడువును శుక్రవారం వరకూ పొడిగించారు. ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 5.30 గంటల్లోపు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చు.

సబ్సిడీ రుణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

రాప్తాడు: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు నేటితో ముగియనుంది. అర్హులైన వారు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు.

నేడు నార్పలలో జాబ్ మేళా

శింగనమల: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ (శుక్రవాకం) జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.డేవిడ్ తెలిపారు. ఐఐఎఫ్ఎల్, యంగ్ ఇండియా తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న యువత అర్హులన్నారు. కళాశాల ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఎస్‌పీటీసీ ఉమాశంకర్‌రెడ్డిని సంప్రదించాలన్నారు.

9న రౌండ్‌టేబుల్ సమావేశం

అనంతపురం టవర్‌క్లాక్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 9వతేదీ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. కుల, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

23న 'అనంత కథా కార్యశాల'

అనంతపురం కల్చరల్: ఔత్సాహిక రచయితలు కథల ఆవిష్కరణలో తీసుకోవాల్సిన మెళకువలను తెలిపే 'అనంత కథా కార్యశాల'ను ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి సంస్థ ప్రతినిధులు డాక్టర్ ప్రగతి తెలిపారు. సీనియర్ రచయితలు వెంకటకృష్ణ, వేంపల్లె షరీఫ్, ఆర్.శశికళ, శ్రీనివాసమూర్తి కథా రచనకు సంబంధించిన సూచనలు, సలహాలు, మెళకువలను అందిస్తారన్నారు. 40 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు 9440798008 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: గుంతకల్లు మండలం పాత కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొందని, వెంటనే పరిష్కరించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబును ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ సమస్య పరిష్కరించుకుంటే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

కుంటెమ్మతల్లి నమో నమః

అనంతపురం కల్చరల్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని కుంటెమ్మ తల్లి దేవస్థానం 10 వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, శేఖరబాబు, శ్రీరాములు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరితేనే బియ్యం..


బియ్యం తీసుకెళుతున్న మహిళ

ఇంటి వద్దకే వచ్చే ఎండీయూ వాహనం మూలకు పడింది. జనం రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన 'ఇంటి వద్దకే రేషన్' పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. దీంతో ప్రజలకు మళ్లీ పాత కష్టాలు వచ్చి పడ్డాయి. పనులు మానుకుని రేషన్ దుకాణాల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ షాపుల్లో ఒకేసారి సరుకుల పంపిణీ చేపట్టకపోవడంతో కార్డుదారులకు కష్టాలు రెట్టింపయ్యాయి. వృద్ధులు, చిన్నారుల తల్లుల అవస్థలైతే వర్ణనాతీతంగా ఉంటున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




రామ్‌నగర్‌లో స్టోర్ వద్ద బియ్యం కోసం గురువారం వేచి ఉన్న లబ్ధిదారులు


ఒకటో రోడ్డులో చౌకదుకాణం వద్ద రేషన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు